# వెలుగును మింగిన చీకటి

వెలుగును మింగటానికి సిద్ధంగా చీకటి పొంచి కూర్చుంది. పొద్దెరగని కొత్త బిచ్చగాడిలా, ఇంకా చీకటి పడకముందే చంద్రుడు ఆకాశపు అంచునుంచి తొంగి చూస్తున్నాడు.

నాలుగు మైళ్ళ దూరాన ఉన్న బస్తీనుంచి చెట్టా పట్టా లేసుకొచ్చిన కంకరరాతి రోడ్డూ, పంట కాలవా అక్కడ విడాకు లిచ్చుకున్నాయి. గుండె రాయి చేసుకున్న రోడ్డు, తూర్పుకి మళ్ళి ఊళ్ళోకెళ్ళిపోతూంది. పంటకాలవ పాపం, నిండుచూలాలు! ఆశలన్నీ నీరైపోగా, బరువుగా, నిండుగా, నిదానంగా ముందుకు సాగిపోతూంది.

రోడ్డుకీ, కాలవకీ విడాకు లిప్పించిన న్యాయమూర్తిలా, వంతెన దిమ్మమీద ఒక్కడే కూర్చునిఉన్నాడు రాఘవరావు.

నిండుగా ఉన్న పంటకాలవ మీదనుంచి పచ్చగా ఉన్న పంటపొలాలమీదనుంచి దృష్టి మరల్చి, ఊరివేపు చూశాడు రాఘవరావు.

ఊరికి ఆ ఉదయమే నిప్పంటుకుంది. ఇంకా ఆరలేదు. ఇంక ఆరేట్టులేదు. ప్రతివాడూ ఆజ్యం పోసేవాడేగాని ఆర్పేవాడెవడూ కనపడ్డంలేదు. అంటుకున్న నిప్పు అంత త్వరగా ఆరడమసలెవరికీ ఇష్టంలేదు. నిప్పు రగులుతూంది. రవ్వలు చిమ్ముతూంది ఇహనో ఇప్పుడో భగ్గుమనేట్టుగా ఉంది ఊరు ఊరంతటినీ బూడిద చేసేట్టుగా ఉంది.

o o o o

ఆ ఊళ్ళో ఆరువందల గడప ఉంది. ఆరువందల గడపకీ మూడు వేల జనాభా ఉంది. మూడువేల జనాభాకీ రెండు పార్టీలున్నాయి. రెండు పార్టీలకీ చాలాకాలంగా వైరాలున్నాయి, వైషమ్యాలున్నాయి ఆ వైరాలూ, వైషమ్యాలూ అంతరించకుండా కాపాడ్డానికి రెండు పార్టీలకీ నాయకులున్నారు. ఒక పార్టీకి మునసబు రామచంద్రయ్య నాయకుడు మరో పార్టీకి ప్రెసిడెంట్ రంగారావు నాయకుడు.

ఆ ఊళ్ళో పిల్లలు అల్లరి చెయ్యడానికి ప్రైమరీ స్కూలు ఉంది. పెద్దలు పేకాడుకోవటానికి లైబ్రరీ ఉంది. బూతు పంచాంగాలు విప్పడానికి రామాలయ ముంది. జాతర్లు జరపడానికి గంగానమ్మ గుడి ఉంది. తాగడానికి కల్లు చావిడీ, సారాకొట్టూ వేర్వేరుగా ఉన్నాయి

ఆ ఊళ్ళో పూచిన మల్లెపువ్వు జిల్లేడు వాసనేస్తుంది
ఆ ఊళ్ళో పుట్టిన కోయిల గుడ్లగూబలా అరుస్తుంది.

ఆ ఊళ్ళో మనుష్యులు ముందునుంచి మనుష్యుల్లాగా, వెనకనుంచి దయ్యాల్లాగా ఉంటారు. నోటితో నవ్వి, నొసటితో వెక్కిరిస్తుంటారు. మినుములు తింటూ, అడిగితే అనుములంటారు. ఒక కంటిలో ప్రేమా. ఒక కంటిలో నిప్పులూ కురిపిస్తారు. పక్కవాడు పచ్చగా ఉంటే కళ్ళలో నిప్పులు పోసుకుంటారు. పక్కవాడింటికి నిప్పంటుకుంటే పండగ చేసుకుంటారు. ఎన్నాళ్ళకీ పండగ రాకపోతే తామే నిప్పంటిస్తారు.

తలలు పగలగొట్టుకోవడానికి, పీకెలు తెగ్గోసుకోవడానికీ, మనిషి నెత్తుర్లో మజాగా స్నానం చెయ్యడానికీ చాలా కాలంగా మొహం వాచిపోయి, ఆ సుముహూర్తం కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న ఆ ఊళ్ళో వాళ్ళకి ఆవేళ మంచి అవకాశం దొరికింది.

ఆవేళ ఉదయం-చెరువులో నీళ్ళు తాగడానికి వెళుతున్న ప్రెసిడెంట్ గారి గేదెలు, పొరపాటున మున్సబుగారి దొడ్లోకి వెళ్ళి అక్కడి పాదులన్నీ తొక్కేసి, తినేశాయి. అంతా అయ్యాక వచ్చిన ప్రెసిడెంట్ గారి పాలేరు పొరపాటయిందన్నాడు కాని. మున్సబుగారు వినలేదు ప్రెసిడెంట్ గారి పాలేరుని దొడ్డంతా తిప్పి తిప్పి కొట్టాడు. మున్సబుగారి పాలేళ్ళు ప్రెసిడెంట్ గారి గేదెల్ని దొడ్లో కట్టేసి బాదారు.

ప్రెసిడెంటు రంగారావు ఈ అవమానాన్ని సహించ

లేకపోయాడు. దెబ్బకి దెబ్బ తీయాలన్నాడు. అతన పార్టీ వాళ్ళంతా సై అంటే సై అన్నారు.

ప్రెసిడెంట్ గారి పాలేరునీ, గేదెల్నీ తన్ని తగిలేశాక మున్సబు రామచంద్రయ్య తన పార్టీ వాళ్ళకి కబురుచేశాడు. తను చేసింది చెప్పాడు. ప్రెసిడెంట్ పాలేరునీ, గేదెల్నీ కొడితే ఏం లాభం, ప్రెసిడెంట్ నే కొట్టాలన్నారు పార్టీ వాళ్ళు.

పంచాయతీ ఆఫీసు దగ్గర ప్రెసిడెట్ గారి బలగం చేరింది. చెరువు కావలిపక్క మున్సబు గారి దొడ్లో మున్సబు గారి బలగం చేరింది. బలగాలతో పాటు బాణాకర్రలు చేరాయి బరిసెలు చేరాయి. ఇంక బరి గియ్యడమే తరువాయి.

"ఇయ్యాల ప్రెసిడెంటుగారి పార్టీకీ, మున్సబుగారి పార్టీకి రైటింగట" అన్నవార్త అర క్షణంలో ఊరంతా కారుచిచ్చులా పాకింది. "ఇయ్యాల పది పీనుగులకు తక్కువెళ్ళవు" అన్నారు. తల కండినవాళ్ళు కొందరు. ఎడంగా నించొని చూడొచ్చు. లెమ్మని సంతోషించారు కొందరు.

ఏ పార్టీలోవాళ్ళా పార్టీలో చేరారు. ఏ పార్టీ లేనివాళ్లు ఇళ్ళలో చేరారు, ఆడవాళ్ళూ, పిల్లలూ అర చేతుల్లో ప్రాణాలు పెట్టుకూచున్నారు.

గంగానమ్మ గుడి పంచాయతీ ఆఫీసుకీ, మున్సబుగారి ఇంటికీ మధ్యలో ఉంది. కొట్లాట జరిగితే అక్కడ జరగాలి. లోగడ జరిగిన కొట్లాట లక్కడే జరిగాయి. అందుకే

కొట్లాట చూడాలన్న కుతూహలం మున్న వాళ్ళంతా గంగా నమ్మ గుడి చుట్టుపక్కలున్న ఇళ్ళలో చేరారు.

కాని, గంగానమ్మ గుడి దగ్గర చేరి బరి గీసి నిలబడ టానికి ఆ పార్టీవాళ్ళకీ, ఈ పార్టీవాళ్ళకీ కూడా ధైర్యం చాల్లేదు. ముందు వాళ్ళని రనిమ్మని వీళ్ళూ, వీళ్ళని రాని మ్మని వాళ్ళూ కాచుక్కూర్చున్నారు. ఎదురూ బొదురూ కలబడితే ఏమవుతుందో, ఎంతమంది చస్తారోనని వాళ్ళకీ, వీళ్ళకీకూడా భయంగా ఉంది. కుర్రకారు కొందరు ముందు కురుకుతామని ఊగుతున్నా, పెద్దవాళ్ళు వెనక్కి లాగు తున్నారు.

ఈ రకంగా గంట గడిచింది. రెండుగంటలు గడి చాయి. మధ్యాహ్నం పన్నెండయ్యేసరికి పొరుగూరు వెళ్ళిన మున్సబు బావమరిది పొలాల కడ్డం పడి ఊళ్ళోకొస్తున్నా డన్న వార్త ప్రెసిడెంట్ పార్టీకి చేరింది. పెద్ద తలకాయలు గబగబా ఆలోచించాయి.

దిట్టమైనవాళ్ళు పదిమంది సందుల్లోకీ, గొందుల్లోకీ మాయమై ప్రైమరీ స్కూలు వెనక వెలిశారు. కర్ర తుమ్మ కంచెల వెనక నక్కారు. అపాయం కానక ఆదమరిచి వస్తున్న మున్సబు బావమరిది, చేనుగట్టు దాటి రాగానే ఒక్కుమ్మడిగా మీదబడి చావబాదారు.

మొదటి విజయం లభించినందుకు ప్రెసిడెంట్ మీసం మెలేశాడు. మున్సబు పళ్ళు పటపట నూరాడు.

ప్రెసిడెంట్ పార్టీ ముఖ్యుల్లో ఒకడైన తిరపతయ్య, చేనుకి నీళ్ళెట్టడానికని చీకటితో లేచి వెళ్ళిన సంగతి మున్నబు పార్టీలో ఎవరికో చటుక్కున గుర్తుకొచ్చింది. వెంటనే ఇరవై మంది లేచారు. కాలవగట్టున పరుగెత్తారు. తిరప తయ్య దారిలోనే దొరికాడు. 'చచ్చాను బాబో' అన్న తిరపతయ్య ఆర్తనాదాలు కాలవగట్టునున్న ఇళ్ళవాళ్ళకి వినిపించాయి కాని, బయటికి రావటాని కెవరికి ధైర్యం చాల్లేదు.

అక్కడితో నిప్పు బాగా రగులుకుంది. పగల పొగలూ, సెగలూ పెరిగాయి. పట్టుదలలు పరాకాష్టనందు కున్నాయి.

మున్నబు పార్టీలో పేరుకి మాత్రమున్న పేరయ్యని బస్తీనుంచి వస్తూండగా దారిలో కాసి కొట్టారు ప్రెసిడెంట్ అనుచరులు.

ప్రెసిడెంట్ తో దూరపు చుట్టరికమేగాని, పార్టీతో ఏ సంబంధమూ లేని అవిటివాడొకణ్ణి సారాకొట్టు దగ్గర పట్టుకు పొడిచారు మున్నబు ముఠావాళ్ళు.

సాయంత్రమైంది. తెల్లవారేలోగా మున్నబును పొడ వకపోతే నా మీసం గొరిగించుకుంటానని ప్రతిజ్ఞ చేశాడు ప్రెసిడెంట్. తెల్లవారేలోగా ప్రెసిడెంటైనా చావాలి, నేనైనా చావాలి అని పట్టు పట్టాడు మున్నబు.

ఊళ్ళో పరిస్థితి ఇలా ఉండగా, ఊరికి ఎడంగా, బస్తీ నుంచి వచ్చే కంకర్రాతి రోడ్డు ఊళ్ళోకి మలుపు తిరిగే చోట, వెలుగును మింగటానికి సిద్ధంగా చీకటి పొంచి కూర్చున్న వేళ, వంతెన దిమ్మమీద ఒక్కడే కూర్చుని ఉన్నాడు రాఘవరావు. ఆ ఊళ్లో పుట్టవలసినవాడు కాడు. కాని, పుట్టాడు. ప్రెసిడెంట్ రంగారావుకి కొడుకై అసలు పుట్టవలసిన వాడు కాడు. కాని, పుట్టాడు. నా కడుపున చెడబుట్టావని ఎప్పుడూ కొడుకుని తిడతాడు ప్రెసిడెంట్. పొద్దున్న కూడా తిట్టాడు. కర్ర పుచ్చుకుని తనతో పాటు రమ్మన్నాడు. రానన్నాడు రాఘవరావు. 'రాకపోతే గాజులు తొడిగించుకుని ఇంట్లో కూర్చో' అని తిట్టి, రణరంగానికి వెళ్ళిపోయాడు రంగారావు.

ఇంట్లో కూర్చున్న రాఘవరావుకి, ఊళ్ళో జరుగుతున్న ఘోరాల గురించి ఎప్పటికప్పుడు వార్తలందిస్తూనే ఉన్నారు పాలేళ్ళు. విని విని పిచ్చెక్కిపోయింది. ప్రెసిడెంట్ భార్య వీరపత్ని. వీరమాత అనికూడా అనిపించుకోవాలని ఆమె కోరిక. కొడుకునికూడా కర్ర పుచ్చుకు బయటికి వెళ్లమని పోరడం మొదలెట్టింది. ఆ పోరు వినలేక రాఘవరావు బయటికొచ్చాడు. కర్ర పుచ్చుకునికాదు; ఉత్త చేతులతో వచ్చాడు. ఊరి మొగదలనున్న ఇంట్లోంచి ఊరిబయటికొచ్చాడు. వంతెన మీదికొచ్చి కూర్చున్నాడు.

ఏం చెయ్యాలో అతని కేమీ తోచడంలేదు. పదేళ్ళ వయసు నుంచీ పట్నంలో మేనమామగారి ఇంట్లో పెరిగాడు.

కాలేజీ చదువు ముగించుకుని ఏడాది క్రితమే స్వంత ఊరికి వచ్చాడు. పల్లెటూళ్ల గురించి, అక్కడి జీవితాన్ని గురించి, తాను విన్నవి, చదువుకున్నవీ, ఊహించుకున్నవీ-అన్నీ ఈ ఏడాది నుంచీ దూదిపింజలై గాలి కెగిరిపోతున్నాయి. పేకమేడలై కూలిపోతున్నాయి. ఉట్టి కలలై కరిగిపోతున్నాయి.

బస్తీనుంచి సైకిల్ మీద వస్తున్న ప్రైమరీ స్కూల్ టీచర్ రామశాస్త్రి, వంతెన దగ్గరి కొచ్చి ఆగాడు. రాఘవరావుని చూసి సైకిల్ స్టాండ్ వేసి తనూవచ్చి పక్కన కూర్చున్నాడు. ఈ ఏడాదినుంచీ రాఘవరావుకి, రామశాస్త్రికి స్నేహం కలిగింది.

"ఎక్కణ్నించి?" అని అడిగాడు రాఘవరావు.

"ఈ వేళ సెలవు గదా అని తెల్లారకట్ట బయలుదేరి మా ఊరెళ్ళొస్తున్నానండీ. అవునూ, ఏమిటి ఊళ్ళో ఏదో గొడవగా ఉందట- బస్తీలో చాకలిరాముడు కనపడి చెప్పాడు?" అన్నాడు శాస్త్రి

పొద్దుటునుంచీ జరిగినదంతా చెప్పాడు రాఘవరావు. చెప్పి, "నువ్విప్పుడు ఊళ్ళో కెళ్ళటం ప్రమాదం.అందులో నువ్వా ఆ చివరికంటా వెళ్ళాలి. ఏమో, నిన్నుకూడాకొట్టినా కొట్టొచ్చు. వాడూవీడూ అని ఏం లేదు...ఎవరి కెవరు

దొరికినా సరే పట్టుకు పోవటమే. అలా ఉంది పరిస్థితి. ఈ రాత్రికి మా ఇంట్లో పడుకో'' అన్నాడు.

''అయితే, పరిస్థితి తీవ్రంగానే ఉందన్నమాట. ఏమిటో, రాఘవరావుగారూ ఈ మనుషుల్లో ఇంతఅమానుషత్వం, నిష్కారణమైన ద్వేషం, ఇంత కాఠిన్యం, ఇంత పశుత్వం, ఇంత రక్త దాహం ఎలా ఉంటాయో నాకు ఛస్తే అర్థం కాదు. పైగా వీళ్లలో చాలామంది చదువుకున్న వాళ్ళుకూడాను'' అన్నాడు శాస్త్రి.

రాఘవరావ్ కాస్సేపాగి, ''చదువుకున్న వాళ్లయితే ఏం లాభం, శాస్త్రి! మీరు చెప్పే చదువులు మనుషుల్ని గుమాస్తాలుగా, ఆఫీసర్లుగా, లాయర్లుగా, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, శాస్త్రవేత్తలుగా తయారు చేస్తున్నాయి. ఇంతకంటే మనుషుల్ని మనుషులుగా తయారుచేసే చదువుచాలా అవసరం'' అన్నాడు.

శాస్త్రి ఏదో అనబోయేలోగా, ప్రెసిడెంటుగారి పాలేరొకడు పరుగెత్తుకొచ్చాడు. ''చినబాబుగారూ! మనోళ్ళు ఇయ్యాల అర్ధరాత్రికి ముస్నబు ఇంటిమీద పడదామని సూత్తన్నారు. మరి ఆళ్ళే ఆలోశన్తో ఉండారో మనకి తెలవదు. ఎప్పటికేం జరుగుద్దో తెలవదు. ఏమైనా ఇయ్యాల రాత్రి నాలుగైదు కూనీలు మటుకు ఖాయంగా జరుగుత్తై. పెద్దయ్యగారు మిమ్మల్ని ఇంటికాడే ఉండమన్నారు, మీరిక్కడ కూసోటం కూడా పెమాదమే, లెగండి'' అన్నాడు రాఘవరావుతో.

"సరే, నే వస్తున్నా వెళ్లమని వాణ్ని పంపేశాడు రాఘవరావు

శాస్త్రి బేజారెత్తిపోయాడు "ఏమిటండీ, బాబూ, ఇదంతా?" అన్నాడు భయపడుతూ.

రాఘవరావు ఏం మాట్లాడలేదు. కాస్సేపు ఆలోచించి, "శాస్త్రీ! నువ్వొక పనిచేయ్ నువ్వు మళ్ళీ బస్తీ కెళ్ళు ఇక్కడి పరిస్థితంతా చెప్పి పోలీసుల్ని తీసుకురా" అన్నాడు.

"నేను పోలీసుల్ని తీసుకొచ్చానని తెలిస్తే ఆ ఊళ్ళో వాళ్ళింకా నన్ను బ్రతకనిస్తారటండీ?" అన్నాడు శాస్త్రీ వణికిపోతూ.

"ఏం ఫర్వాలేదు నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు వేస్తాను. నువ్వు తప్ప ఇక్కడీ పని చెయ్యగలిగినవాళ్లెవరూ లేరు కొన్ని ప్రాణాలు కాపాడినవాడివవుతావు, త్వరగా వెళ్ళు" అన్నాడు రాఘవరావు.

శాస్త్రీ సైకిలెక్కి బస్తీవైపు వెళ్ళిపోయాడు. రాఘవరావు లేచి వూళ్ళోకి బయలుదేరాడు

○ ○ ○

చీకటి వెలుగును పూర్తిగా మింగేసింది వైస్ ప్రెసిడెంటు చలపతిరావింట్లో ప్రెసిడెంటుగారి పార్టీకి. మునసబు తమ్ముడు వెంకటరత్నం ఇంట్లో మునసబుగారి పార్టీకి భోజనపు ఏర్పాట్లు జరిగాయి. కోడి పలావులూ, సారా బుడ్లూ

సమకూరాయి. తింటూ, తాగుతూ రాత్రికి ఎవర్ని ఎలా చంపడమా అని ఆలోచిస్తున్నారు, ఉభయ పార్టీలవారూ కూడా.

సరిగ్గా ఆ సమయానికి మున్సబుగారింట్లో ఘొల్లున ఆడవాళ్ల ఏడుపులు వినిపించాయి. తమ్ముడి ఇంట్లో పరివారంగా విందారగిస్తున్న మున్సబు లేచి తన ఇంటివేపు పరుగెత్తబోయాడు మున్సబు తమ్ముడూ. మరికొంతమంది కలిసి ఆయన్ని ఆపి, "మీరొద్దు. మీరిక్కడే ఉండండి, మేం వెళ్ళి చూసొస్తా"మని కర్రలూ, బరిసెలూ పుచ్చుకు పరుగెత్తారు.

పురిటికి పుట్టింటికొచ్చిన మున్సబుగారి పెద్ద కూతురు ఉన్నట్టుండి బిగుసుకు పోయింది కళ్ళు తేలవేసి, పళ్ళు బిగబట్టింది గుప్పిళ్ళు బిగుసుకున్నాయి ఒళ్ళు చల్లబడింది. అసలే కాస్త భారీమనిషి అందులో నిండు నెలలు ఇంకేముంది? వాతం ముంచుకొచ్చింది. పిల్ల బతకదని ఆడవాళ్ళు శోకాలు ప్రారంభించారు. వెంటనే బస్తీకి తీసుకెళ్ళి ఆసుపత్రిలో చేర్చాలి, లేకపోతే ప్రమాదమన్నారు చుట్టుపక్కల ఆడవాళ్ళు ఏం జరిగిందో చూద్దామని వచ్చిన మున్సబు తమ్ముడూ, మిగతా వాళ్ళూ కలిసి, అయిదు నిమిషాల్లో బండీ, ఎడ్లూ సిద్ధం చేశారు. మున్సబు కూతుర్ని బండిలో పడుకోబెట్టారు. మున్సబు భార్య, మరో ఇద్దరు ఆడవాళ్ళుకూడా బండిలో ఎక్కారు. "అమ్మాయికి కాస్త జబ్బు చేసింది, బస్తీకి తీసుకెళ్ళుతున్నాం. ఏం ఫర్వాలేదు,

నువ్వేం భయపడకు" అని అన్నకి కబురు చేసి, మున్నబు
తమ్ముడు మరో నలుగుర్ని తన వెంట తీసుకుని బండితో పాటు
బయలుదేరాడు.

అడ్డదారులూ, వంకలూ గొంకలూ- అన్నీ జాగ్రత్తగా దాటి, బండి రోడ్డెక్కేసరికి ప్రెసిడెంట్ పార్టీ వాళ్ళు దాదాపు ఇరవై మంది రోడ్డు కడ్డంగా నిలబడి ఉన్నారు. మున్నబు తమ్ముడు బండి తొట్లోంచి రోడ్డుమీది కురికాడు. అతను దెబ్బ కాచుకునేలోగా అతని మీద ఇరవై దెబ్బలు పడ్డాయి. కింద పడిపోయాడు. బండి వెంట వచ్చినవాళ్ళలో ఇద్దరు కాలికి బుద్ధి చెప్పారు. మిగతా ఇద్దరూ ఇక లాభం లేదని. కర్రలు పారేసి చేతులెత్తేశారు. వాళ్ళ చుట్టూ, బండి చుట్టూ ప్రెసిడెంట్ మనుషులు గోడ కట్టేశారు. బండిలో ఉన్న ఆడవాళ్ళు ఘొల్లుమన్నారు. మున్నబు భార్య బండి దిగి, బండి వెళ్ళనిమ్మని కాళ్ళావేళ్ళాపడి బతిమాలింది ఆలస్యమైతే తన బిడ్డ బ్రతకదని ఏడ్చింది. ప్రెసిడెంటు పార్టీ వాళ్ళు చలించలేదు. "నీ మొగుడొచ్చి కాళ్ళమీద పడి మాకు లొంగిపోతే బండి కదలనిస్తాం. లేకపోతే నీ కూతురు ఇక్కడ చావాల్సిందే" అన్నారు.

వంతెనమీదనుంచి ఊళ్ళోకి బయలుదేరిన రాఘవరావు, కాస్త దూరం నుంచి ఇదంతా గమనించాడు.

తన తండ్రి పార్టీవాళ్ళే ఏదో అఘాయిత్యం చేస్తున్నారని తెలుసుకున్నాడు. గబగబా బండి దగ్గరి కొచ్చాడు.

విషయం తెలిసింది మున్సబు భార్య రాఘవరావు చేతులు పుచ్చుకుని, "బాబూ! చచ్చి నీ కడుపున పుడతా. నువ్వయినా బిడ్డని కాపాడ"మని ఏడ్చింది. రాఘవరావు కరిగి పోయాడు. చుట్టూ చూశాడు. అన్నీ రాతి విగ్రహాలే గాని, మనిషికి ఒక్కడూ కనపడలేదు లాభం లేదనుకుని ముందుకి సాగిపోయాడు.

బండి దాటి వెళ్ళి తన ఇంటివేపు మలుపు తిరిగిన రాఘవరావు, కొద్దిసేపటికే వెనక్కి పరుగెత్తి వచ్చాడు. బండి దగ్గరున్న వాళ్ళు ఏమిటేమి టన్నారు "నాన్నా. మరో నలుగురూ లైబ్రరీ బజార్ని పరుగెత్తుతున్నారు. మున్సబు పార్టీ వాళ్ళు తరుము తున్నారు వాళ్ళు చాలామంది ఉన్నారు మనవాళ్ళు నలుగురే ఉన్నారు. మిగతా వాళ్ళేమయ్యారో తెలీదు. మన వాళ్ళు గనక వాళ్ళకి దొరికితే చచ్చిపోతారు. మీ రిటు చేల కడ్డంబడి. పంచాయతీ ఆఫీసు దగ్గరి కెళ్ళి, మనవాళ్ళ నింకా తీసుకుని లైబ్రరీ వేపు రండి నేను నా ఇంటి మీదుగా రామాలయం మీదుగా ఇట్నుంచి. ఇంకెవరైనా ఉంటే తీసుకొస్తాను, పరుగెత్తండి" అన్నాడు రాఘవరావు రొప్పుతూ.

నాయకుడికే ప్రమాద మున్న సంగతి వినేసరికి అక్కడున్న ప్రెసిడెంట్ మనుషులకి మతి పోయింది మారు మాట్లాడకుండా చేల కడ్డంపడి పరుగెత్తారు.

వాళ్ళు వెళ్ళగానే రాఘవరావు మున్సబు భార్య ముందు కొచ్చి "ఇంక మీ బండి వెళ్ళొచ్చునమ్మా" అన్నాడు.

మున్సబు భార్యకి రాఘవరావు చేసిందేమిటో అర్థ అర్థమైంది. పూడిపోయిన గొంతుతో- "నూరేళ్ళు బ్రతుకు నాయనా" అని ఆశీర్వదించింది. కర్రలు పారేసి, బందీలై కూర్చొన్న మున్సబు మనుషు లిద్దరికికూడా రాఘవరావు చేసిందేమిటో అర్థమైంది. దెబ్బలు తిని కింద పడి ఉన్న మున్సబు తమ్ముణ్ణి ఆ మనుషుల సాయంతో బండిలో కెక్కించాడు రాఘవరావు బండి బస్తీవేపు సాగిపోయింది.

"హమ్మయ్యా!" అనుకొని తృప్తిగా, ఆనందంగా ముందుకు నడిచాడు రాఘవరావు. ఇంటువేపు తిరిగే మలుపులో, నిద్రగన్నేరుచెట్టు చాటునుంచి హఠాత్తుగా పది మంది ముందుకు దూకి రాఘవరావుమీద విరచుకు పడ్డారు

○ ○ ○

రాత్రి పదిన్నరకి, బస్తీనుంచి పోలీసుల్ని తీసు కొచ్చిన రామశాస్త్రికి రాఘవరావు ఎక్కడా కనపడలేదు. ఒంటినిండా బరిశెపోట్లతో, రక్తపు మడుగులో రాఘవ రావు శవం కనపడింది!

"శాస్త్రీ! మనుషుల్ని మనుషులుగా తయారుచేసే చదువు చాలా అవసరం" అని ఎవరో తనగుండెల్లో దూరి బిగ్గరగా అరుస్తున్న ట్టనిపించింది రామశాస్త్రికి.

———